సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 9 । జూలై । 2024



అడవి బిడ్డల పండుగ సీత్లా

బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా పండుగ. ఆషాడంలో ఒక మంగళవారం ఎంచుకుని పండుగను నిర్వహిస్తారు.

- 8లో▸



సహకార సంఘాలు బలోపేతం

కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణతో పీఏసీఎస్‌లు మరింత బలోపేతం అవుతాయని మార్నేని రవీందర్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం మాములు ఉష్ణోగ్రత ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రౌడీ షీటర్లపై పోలీస్ నిఘా

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మహబూబాబాద్ రూరల్: రౌడీ షీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. రౌడీ షీటర్లకు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అల్లర్లు, గొడవలు, భూ తగాదాలు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్లలో సంతకాలు చేస్తూ ఉండాలని, బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించేలా బోధించాలి

- డీఈఓ రామారావు



కేసముద్రం: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా బోధన చేయాలని డీఈఓ రామారావు అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్, మహమూద్ పట్నంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను సోమవారం సందర్శించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి గ్రేడింగ్‌ని చార్ట్‌పై రాసి క్లాస్‌రూంలో ప్రదర్శించాలన్నారు. బేస్‌లైన్ టెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. 2023–2024 టెన్త్ ఫలితాలను కూడా ప్రదర్శించాలన్నారు. సబ్జెక్టు వారీగా రివ్యూ చేసి మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఈసీఓ విజయకుమారి, ఎంఈఓ శ్రీదేవి, ఏఐఎంఓ ఆజాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు

మహబూబాబాద్: మానుకోట (కాలేజ్ కోడ్ జేఎన్ఎంబ) 2024–25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ రెసిడెన్షియల్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ల విషయంలో పురోగతి ఉందన్నారు. బీటెక్ ప్రతీ బ్యాచ్‌లో 60 సీట్లు ఉన్నాయని 2023–24 విద్యాసంవత్సరంలో సీఎస్ఈ (డేటా సైన్స్) ఈసీఈ, ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులు రెసిడెన్షియల్ హాస్టల్ సౌకర్యం కల్పించారన్నారు. ఉత్తీర్ణత శాతం 93 ఉందని జేఎన్‌టీయుహెచ్ యుసీఈ మానుకోట క్యాంపస్‌లో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. అన్ని విభాగాల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించి అత్యధిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీ, బాల బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



నెల్లికుదురు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజావాణిని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో పీడీ సదర్‌లాల్ వినియోగదారులను కోరారు. సోమవారం మండలంలోని నల్లగుట్ట తండాలో జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులను ట్రాన్స్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సదర్‌లాల్ సందర్శించి పరిశీలించారు. అనంతరం మండలకేంద్రంలోని సబ్ స్టేషన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించారు. నల్లగుట్ట తండాలో జరుగుతున్న విద్యుత్ అభివృద్ధి పనులు 3 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నైనాలలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్‌ను కలిసి విద్యుత్ అభివృద్ధి పనులపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ నరేష్, డీఈ మధుసూదన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సన్నాల సాగుకే మొగ్గు

మార్కెట్‌లో ధర, ప్రభుత్వ బోనస్
- బియ్యం ఎగుమతితో డిమాండ్
- జిల్లాలో 2,15,278 ఎకరాల్లో వరి సాగు అంచనా



సాక్షి, మహబూబాబాద్: గతేడాది వివిధ రకాల వరి పంటలు సాగుచేసిన రైతులు ఈ ఏడాది సన్నరకాల సాగుకే మొగ్గుచూపుతున్నారు. దొడ్డురకం సాగుచేసి ఇబ్బందులు పడేకంటే సన్న రకాలు సాగు చేస్తే కల్లాల వద్దనే కాంటాలు, మంచి ధరతోపాటు తినేందుకు బియ్యం కూడా పండించుకోవచ్చనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాకు అదనంగా రూ.500 ఇస్తామని ప్రకటించింది. ఇన్ని విధాలుగా ప్రయోజనాలు ఉన్న సన్నరకం వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు.

నార్లు పోసిన రైతులు

గతేడాది కన్నా ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పెద్ద వర్షాలు వస్తే నాట్లు వేసే విధంగా జిల్లా రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో అన్ని పంటలు కలిపి 4,29,790 ఎకరాల్లో సాగుచేస్తారని, ఇందులో 2,15,278 ఎకరాల్లో వరి సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. దీనికి అనుగుణంగా రైతులు 56,735 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని తేల్చారు. దీంతో జిల్లాలోని ఆగ్రోస్, ఇతర విత్తనాల దుకాణాల్లో రకరకాల విత్తనాలు అందుబాటులో ఉంచారు. అయితే ఈ ఏడాది ఎక్కువగా సన్నరకం విత్తనాలే కొనుగోలు చేస్తున్నారని విత్తనాల దుకాణాల యజమానులు చెబుతున్నారు. ఇందులో వరంగల్ సాంబ, సాంబ మసూరి, జై శ్రీరాం, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, 1262, చింట్లు, బీపీటీ రకాలు ఎక్కువగా కొనుగోలు చేసి నార్లు పోశారు. ఇలా జిల్లాలో ఇప్పటి వరకు 50వేల క్వింటాళ్ల విత్తనాలు విక్రయాలు జరిపితే ఇందులో 35 వేలకు పైగా సన్నరకాలు అమ్మకాలు జరిపారు.

సులభ మార్కెటింగ్, అధిక ధర

సన్నరకాలు సాగు చేస్తే సులభంగా మార్కెటింగ్ తోపాటు, అధిక ధర పలుకుతుందని రైతులు చెబుతున్నారు. గతేడాది వానాకాలం, యాసంగిలో సన్న రకం సాగుచేసిన రైతుల వద్దకు వ్యాపారులు వెళ్లి కొనుగోలు చేశారు.అది కూడా హార్వెస్ట్ మిషన్ నుంచే నేరుగా లారీల్లోకి ఎత్తుకున్నారు. పచ్చి ధాన్యం సన్నరకాలు క్వింటాకు రూ.2,350 వరకు పెట్టి ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్–ఏ రకం రూ.2,260, కామన్ గ్రేడ్ రూ.2,220 మాత్రమే పెట్టారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం ఆరబోసి, తేమ శాతం లేకుండా చూసి గాలి, దుమారం, వర్షానికి ఇబ్బంది పడి అమ్మడం కన్నా.. సన్న రకాలు వేస్తే ఏ చికాకు లేకుండా మంచి ధరకు అమ్మే అవకాశం వచ్చింది. ఈ ఏడాది మద్దతు ధర గతేడాది కన్నా క్వింటాకు రూ. 100 పెంచడంతో గ్రేడ్–ఏ రకం రూ. 2,360, కామన్ రకం రూ. 2,320 పలుకుతుంది. దీనికి తోడు ప్రభుత్వం చెప్పిన విధంగా సన్న రకాలకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తే అప్పుడు క్వింటా ధర రూ. 2,860కి చేరుతుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్న సన్నరకం వరి సాగుచేస్తే మేలనే నిర్ణయం రైతులు తీసుకుంటున్నారు.

పొలం దగ్గరే కాంటాలు..



నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. గతేడాది సగం సన్నవి, సగం దొడ్డు రకాలు సాగుచేశా. సన్నరకం ధాన్యం పొలం వద్దకే వచ్చి వ్యాపారులు కొనుగోలు చేశారు. కాని దొడ్డు రకం ధాన్యం అమ్మేందుకు నానా ఇబ్బందులు పడ్డాను. అందుకే ఇప్పుడు మొత్తం సన్నరకం వరి విత్తనాలు తెచ్చి నారు పోశా.

- జెనిగల సోమలింగం, బొడ్లాడ

ప్రభుత్వ బోనస్ ఇస్తే మరింత లాభం..



దొడ్డురకం సాగుచేస్తే పంట దిగుబడి ఎక్కువ వస్తుంది. కానీ మార్కెటింగ్ ఇబ్బంది అవుతుంది. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఉండాల్సి వస్తుంది. మంచి రకాలు నిల్వ ఉంచి బియ్యంగా మార్చి అమ్మితే మరిన్ని లాభాలు వస్తాయి. అందుకోసమే సన్న రకాలు సాగుచేస్తున్నా.

- కొండ్రెడ్డి ప్రభాకర్ రెడ్డి, నర్సింహులపేట

రిస్క్ తక్కువ, లాభం ఎక్కువ..



సన్నాలకే డిమాండ్ ఎక్కువగా ఉంది. నాకున్న రెండు ఎకరాల పొలంలో పనులు మొదలు పెట్టా. అందులో ధాన్యలక్ష్మి సన్న వడ్లను వేద్దామని నారు పోశాను. గతేడాది ఇవే వడ్లను పండించా. దిగుబడి ఎక్కువగా వచ్చింది. ధర కూడా ఎక్కువగానే పలికింది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించా.

- అనంతగిరి సురేష్, రైతు, చిన్నగూడూరు

భూసారాన్ని బట్టి సాగుచేయాలి



రైతులు నీటి వనరులు, భూసారాన్ని బట్టి సన్న, దొడ్డు రకాలు సాగుచేయాలి. ఏ పంటలు సాగుచేసినా.. స్థానిక వ్యవసాయాధికారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. దొడ్డు రకాలతో పోలిస్తే సన్నరకాల దిగుబడి తక్కువగా వస్తున్నా.. మార్కెట్‌లో మాత్రం డిమాండ్ ఉంటుంది. రైతులు ఎక్కువగా సన్నరకాల సాగుకే మొగ్గు చూపుతున్నారు.

- అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

జన హృదయ నేత వైఎస్సార్

ఆయన జీవిత చరిత్ర నేటి తరానికి దిక్సూచి
- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్
- ఘనంగా మహానేత జయంతి



వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ రూరల్: ప్రజాబలంతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి రెండుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి సోమవారం ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్.రాజశేఖరరెడ్డి జీవిత చరిత్ర నేటి తరానికి దిక్సూచి అని కొనియాడారు. వైఎస్ఆర్ పాదయాత్రతో రాష్ట్రమంతా తిరిగి ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి ఎంతో మంది నిరుపేదల ప్రాణాలు కాపాడిన మహనీయుడన్నారు. 108కు శ్రీకారం చుట్టి దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు తెచ్చి బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతిగా అందరి గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుగులోత్ రాములునాయక్, ఖలీల్, ఎడ్ల రమేష్, శంతన్ రామరాజు, భువనగిరి గిరిధర్ గుప్తా, బోళ్ళ రాజు, గోనె శ్యామ్, చిట్టోజు సుదర్శన చారి, పద్మం ప్రవీణ్, శ్రీనివాస్, రాములు, దీలిప్, నారాయణసింగ్, పిట్టల రాము పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

కొత్తగూడ: మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె మట్లాడారు. అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తే ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండదన్నారు. అనంతరం కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కువగా హక్కు పత్రాలు ఉండి రైతు బంధు రాలేదని, తమ భూమికి హక్కు పత్రాలు ఇవ్వలేదని, గిరివికాస్‌లో బోరు బావులు మంజూరు చేయాలని, బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, తమ పిల్లలకు వివిధ పాఠశాలల్లో సీట్లు కావాలని వినతి పత్రాలు అందించారు. అవకాశం ఉన్న వాటికి వెంటనే పరిష్కారం చూపించారు. మహబూబాబాద్ డీడీ కార్యాలయ సిబ్బంది పనితీరు బాగాలేదని వారిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి వినతి పత్రం అందచేశారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పీఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీ ఎర్రయ్య, తహసీల్దార్ రమాదేవి, ఇంజనీరింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

● సర్పాల సయ్యాట





సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని చిట్టూరి మల్లయ్య అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో సోమవారం సర్పాలు సయ్యాటలాడాయి. రెండు సర్పాలు ఒకదానికొకటి అల్లుకుని ఆడుతుండడంతో తోటలో పనిచేసే రైతుతోపాటు పలువురు కూలీలు ఆసక్తిగా తిలకించారు. కొంత సమయం తర్వాత పాములు విడిపోయి వెళ్లిపోయాయి. - కురవి

'వారాహి' అలంకరణలో భద్రకాళి

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి ఆలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని కుల్లా, నిత్యక్రిన్నా క్రమంలో అలంకరించి పూజలు చేశారు. అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలమూర్తిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.

వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు

- ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. సోమవారం జిల్లాలో నిర్వహించిన విద్యుత్ ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు చేసేందుకు విద్యుత్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని, టీజీ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోని కన్జ్యూమర్ గ్రీవెన్స్ పోర్టల్‌లో ఫిర్యాదులు చేయవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రెండురోజులు కొట్టి డ్రగ్ ఇంజక్షన్ ఇచ్చారు

సామాజిక మాధ్యమాల యూజర్ల ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయాలన్నారు
- బ్లాక్ మెయిల్ చేయడం ఇష్టం లేదనడంతో చిత్రహింసలకు గురిచేశారు..
- చేయని నేరాలు మోపి 45 రోజులు జైలులో ఉంచారు
- ఏజెంట్లను నమ్మితే ఇబ్బందులే....
- ఎంబసీలో నిర్ధారించుకున్న తర్వాతే విదేశాలకు వెళ్లాలి
- కంబోడియా చెర నుంచి ఇంటికి వచ్చిన ప్రకాష్ మనోగతం



సీఐ రవికుమార్‌తో మాట్లాడుతున్న ప్రకాష్

బయ్యారం: 'సామాజిక మాధ్యమాల యూజర్ల వీడియోలు, ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిలింగ్ చేయాలన్నారు. నాకు ఇష్టం లేదని చెప్పడంతో చిత్రహింసలకు గురిచేశారు. డ్రగ్ ఇంజక్షన్ వేసి విపరీతంగా కొట్టారు. చేయని నేరాలు మోపి 45 రోజులు జైలులో నిర్బంధించారు. ఉద్యోగం...విదేశాల మోజులో ఉన్న వారు ఏజెంట్ల మాటలను నమ్మి వెళ్తే అక్కడ ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు' అని కంబోడియాలో చిత్రహింసలకు గురై వారి చెరనుంచి తిరిగి భారతదేశానికి వచ్చిన బయ్యారం మండలం గంధంపల్లికి చెందిన మున్సిఫ్ ప్రకాష్ తెలిపారు. కంబోడియా కష్టాలనుంచి క్షేమంగా ఇంటికి చేరుకున్న ప్రకాష్ సోమవారం 'సాక్షి'తో అక్కడ తను పడిన బాధలు.. అనుభవాలు పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే.. నాది సివిల్ ఇంజనీరింగ్ పూర్తికాగా, హైదరాబాద్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఇక్కడ రూ.35వేల వేతనం ఇచ్చేవారు. విదేశాల్లో ఉద్యోగం అంటూ ఓ వెబ్‌సైట్‌లో వస్తే అప్లయ్ చేశాను. అందులోని ఫోన్ నంబర్‌తో తమిళనాడుకు చెందిన ఓ ఏజెంట్ నన్ను సంప్రదించాడు. కంబోడియాలోని బావట్ పట్టణంలోని ఓకే వీఐపీ కంపెనీలో ఇండియా కరెన్సీ ప్రకారం 90 వేల రూపాయల వేతనం ఒప్పందంతో నేను అక్కడికి వెళ్లిపోయా. కంపెనీలో చేరిన వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది నా పాస్‌పోర్టు, బ్యాగు, ల్యాప్‌టాప్ సెక్యూరిటీ రీజన్ పేరుతో తీసుకున్నారు. ఏడురోజులపాటు శిక్షణ పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ యూజర్లకు సంబంధించి మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు తయారు చేసి ఏవిధంగా బ్లాక్‌మెయిల్ చేయాలో వివరించారు. ఇలా రోజుకు ఇండియా కరెన్సీ ప్రకారం రూ.1.80 లక్షలు కంపెనీకి జమయ్యేలా చూడాలని టార్గెట్ విధించారు.

పని నచ్చలేదనడంతో వేధింపులు మొదలు...

ఒకరిని ఇబ్బందులకు గురిచేయడం నాకు నచ్చడం లేదని కంపెనీ నిర్వాహకులకు తెలిపా. అప్పటినుంచి వేధింపులు మొదలయ్యాయి. నా సెల్‌ఫోన్‌ను తీసుకొని డార్క్ రూమ్‌లో నిర్బంధించారు. ఆ తరువాత పనిచేస్తా అని చెప్పడంతో సెల్‌ఫోన్ ఇచ్చారు. ఇక్కడి ఇబ్బందులను కుటుంబసభ్యులు, స్నేహితులకు చెప్పాను. ఆ తరువాత విషయాన్ని తెలుసుకున్న కంపెనీకి చెందిన ఏడుగురు వ్యక్తులు నన్ను రెండురోజులు కొట్టి డ్రగ్ ఇంజక్షన్ ఇచ్చారు. ఆ మత్తులోనుంచి బయటకు వచ్చిన తరువాత నేను మరొకరి సెల్‌తో వీడియోకాల్ చేసి మరోసారి నా ఇబ్బందులను సన్నిహితులకు తెలిపా. వారు మీడియాను ఆశ్రయించటంతో పాటు పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వటంతో విషయం భారత ఎంబసీ అధికారుల దృష్టికి చేరింది.

45 రోజులు జైలు... ఆ తరువాత న్యాయపోరాటం....

ఇండియన్ ఎంబసీ అధికారుల రిస్క్ ఆపరేషన్ తరువాత నాతోపాటు మరో ఎనిమిది మంది భారతీయులను కంబోడియా పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి నేరాలను మోపి అక్రమంగా 45 రోజులపాటు జైలులో నిర్బంధించారు. నేను జైలులో ఉన్న విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ కవిత కంబోడియాలో స్థిరపడ్డ తెలుగువాసి కిరణ్‌రెడ్డికి తెలిపి రక్షించాలని కోరారు. దీంతో కిరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నాకు పలు విధాలుగా సహాయపడటంతో అక్కడి న్యాయస్థానంలో న్యాయపోరాటం చేశారు. కోర్టు కేసు గెలవడంతో ఆ దేశానికి చెందిన అధికారులు క్షమాపణలు తెలిపారు.

విదేశాల్లో ఆఫర్ వస్తే వివరాలు నిర్ధారించుకోవాలి....

విదేశాల్లో ఎవరికైనా ఉద్యోగ ఆఫర్ వస్తే మొదటగా అందుబాటులో ఉన్న ఎంబసీ కార్యాలయంలో ఆ కంపెనీకి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలి. అందులో భారతీయులు ఎంతమంది పనిచేస్తున్నారో తెలుసుకొని ఎక్కువ సంఖ్యలో ఉంటేనే వెళ్లాలి. తక్కువ ఉంటే వెళ్లకపోవడమే మంచిది.

అందరికి రుణపడి ఉంటా.....

కంబోడియా చెర నుంచి నాకు విముక్తి కలిగించేందుకు మాజీ ఎంపీ కవిత, డీఎస్పీ తిరుపతిరావుతోపాటు పలుస్థాయిలో ఉన్న అధికారులు, మీడియా, స్నేహితులు, బంధువులు సాయపడ్డారు. అందరికి రుణపడి ఉంటాను. కాంబోడియాలోని ఇండియన్ ఎంబసీ అధికారులతో నేను ఇబ్బందులు పడుతున్న సమయంలో మాట్లాడిన గార్ల–బయ్యారం సీఐ రవికుమార్‌తో పాటు సహకరించిన ఎస్సై ఉపేందర్ కృతజ్ఞతలు.



ప్రకాష్

వినతులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్: ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్, ఎం.డేవిడ్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి ముఖ్య ఉద్దేశ్యం కూడా అందుకేనని అధికారులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజల నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా అధికారులు పని చేయాలన్నారు. కాగా ప్రజావాణిలో 205 వినతులు రాగా ఆయా శాఖలకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నర్మద, సీపీఓ సుబ్బారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతి బాయి, డీసీహెచ్ఓ మరియన్న, డీఈఓ రామారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిట్టీలతో మోసం.. నలుగురి అరెస్ట్‌
వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య


నిందితుల అరెస్ట్‌ చూపుతున్న ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య

ఖిలా వరంగల్‌: ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పేరుతో 275 మంది నుంచి నెలవారీగా సుమారు రూ.5కోట్లు సేకరించి పరారైన నలుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వరంగల్‌ మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వరంగల్‌ రైల్వేగేట్‌ పెరకవాడకు చెందిన పుప్పాల రాజేందర్‌, అతడి కుమారుడు అనురాగ్‌, భార్య శ్రీలత, కుమార్తె ప్రణవీ.. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాట చిట్టీలు, మహాలక్ష్మీ పరపతి సంఘం పెట్టి 275 మంది సభ్యుల నుంచి సుమారు రూ.5కోట్లు పైగా సేకరించి కుటుంబ సమేతంగా రాత్రికి రాత్రే పరారయ్యారు. దీనిపై వరంగల్‌ గిర్మాజీ పేటకు చెందిన పెంచాల రంజిత్‌ కుమార్‌.. రాజేందర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులపై మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పెరకవాడలోని ఇంట్లోనే నలుగురిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై యువకుడి దాడి
రఘునాథపల్లిలో ఘటన

రఘునాథపల్లి: హారన్‌ కొడుతూ ఓవర్‌ టేక్‌ చేసే క్రమంలో బస్సు డ్రైవర్‌ను చూస్తూ కారు నడుపుతున్న యువకుడు ఎగతాళి చేసిన వివాదం పరస్పర దాడుల వరకు వెళ్లిన సంఘటన మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. టీజీఎస్‌ ఆర్టీసీకి చెందిన వరంగల్‌-1 డిపోకు చెందిన గరుడ బస్సు హనుమకొండ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌ వెళ్తోంది. రఘునాథపల్లి దాటాక ముందు వెళ్తున్న కారు కొద్ది దూరం వరకు బస్సుకు సైడ్‌ ఇవ్వలేదు. హారన్‌ కొడుతూ ఓవర్‌ టేక్‌ చేసే క్రమంలో కారు నడుపుతున్న యువకుడు బస్సు డ్రైవర్‌ను చూస్తూ ఎగతాళి చేశాడు. దీంతో బస్సును డ్రైవర్‌ పక్కన ఆపాడు. యువకుడు కారు నుంచి దిగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పరస్పరం దాడి చేసుకున్నారు. యువకుడి దాడిలో బస్సుడ్రైవర్‌కు గాయం కాగా ప్రయాణికులు యువకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలికి వెళ్లిన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘర్షణ నేపథ్యంలో సుమారు పావుగంటకుపైగా బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ గొడవపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా బస్సుడ్రైవర్‌ ప్రయాణికులతో హైదరాబాద్‌కు వెళ్లాడని, అతను వచ్చి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.



అడవి బిడ్డల పండుగ సీత్లా

సీత్లా ఉత్సవ విగ్రహాలు



బంజారాలు పవిత్రంగా నిర్వహించే మొదటి పండుగ సీత్లా పండుగ.. బంజారాల సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీత్లా భవానీ పండుగను నిర్వహిస్తారు. వానాకాలంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా సీత్లా భవానీ కాపాడుతుందని బంజారాల విశ్వాసం. పశు సంపద వృద్ధి చెందాలని.. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని.. అటవీ సంపద తరగకూడదనీ సీత్లా మాతకు మొక్కులు చెల్లిస్తారు. తండాల్లో జీవనం సాగిస్తున్న వారిలో పెద్ద మనిషితో చర్చించి ఆషాఢంలో ఒక మంగళవారం ఎంచుకుని సీత్లా పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగను ఏటా మంగళవారం రోజు మాత్రమే నిర్వహించడం ఆనవాయితీ. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోని పలు తండాలలో నేడు (మంగళవారం) సీత్లా భవానీ పండుగను జరుపుకుంటారు.

- హన్మకొండ కల్చరల్‌

సంప్రదాయ దుస్తుల్లో సీత్లా వద్దకు వెళ్తున్న బంజారాలు (ఫైల్‌)



నేడు గొడ్లదాటుడు(దాటోడి) వేడుక

- నైవేద్యంగా బెల్లన్నం సమర్పణ
- ఆషాఢ మాసంలో బంజారాల తొలిపండుగ

బంజారాలు సంచారజీవులు..

పూర్వం బంజారాలు సంచార జీవనం సాగించేవారు.. రాజ వంశీయులైన వీరి ప్రధాన వృత్తి వ్యాపారం. ప్రపంచంలోని ఒక్కో తెగకు ఉన్నట్లే వీరికి ప్రత్యేక ఆచార, వ్యవహారాలు భిన్నంగా ఉన్నాయి. ప్రాచీన కాలంలో ముత్యాలు, రత్నాలు, ఉప్పు, జొన్నలు విరివిగా దొరికేవి.. దీంతో వీటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేస్తూ విక్రయిస్తుండేవారు. వాహనాలు లేకపోవడంతో ఎండ్ల బండినే ఉపయోగించి, వీరి సంచారం జీవనం గడిపేవారు. ఇందులో భాగంగానే ఎడ్లబండికి పశువులు అవసరం. అయితే ప్రాంతాలు మారుతున్న చోట తరచూ రోగాలబారిన పడి పశువులు మృత్యువాత పడేవి. ఈ క్రమంలో ఓ రోజు తండా పెద్ద (నాయక్‌) కలలో సీత్లా భవానీ ప్రత్యక్షమై తనను ప్రతిష్ఠించి పూజలు చేస్తే పశువులకు రోగాలు రాకుండా కాపాడుతానని వాగ్దానం చేస్తుంది. నాటి నుంచి నేటి వరకు మంగళవారం రోజు సీత్లా మాతను పూజిస్తారు.

సీత్లా భవానీ చరిత్ర..

దివి నుంచి భువికి దిగి వచ్చిన ఏడుగురు దేవతల్లో మేరమా, తోల్జా, మంత్రళ్‌, కంకాళి, హింగ్లా, ద్వాళంగర్‌లలో చిన్నామే సీత్లా మాత. వీరికి ఓ తమ్ముడు లుంక్డియా ఉన్నాడు. ఏడుగురు దేవతల్లో ఆరుగురిని ఇంట్లోనే ప్రతిష్ఠించి పూజిస్తారు. కానీ అందరికన్నా చిన్నదైన సీత్లా భవానీని మాత్రం అడవిలో పూజిస్తారు. ఇందుకు కారణం సీత్లామాత, లుంక్డియా ఓసారి అడవిలో పశువులను మేపేందుకు వెళ్లి దారి తెలియక మాయమైపోయారు. సీత్లా మాత అక్కడే రాయిగా మారిందని పూర్వీకులు చెబుతారు. అందుకే సీత్లాను అడవిలోనే పూజించే ఆచారం తరతరాలుగా వస్తుంది.

తండా పొలిమేరలో సీత్లా మాత ప్రతిష్ఠ..

తండా సరిహద్దు పొలిమేర వద్ద సీత్లా భవానీని శాస్త్రీయంగా ప్రతిష్ఠిస్తారు. గిరిజన వేషధారణలతో మహిళలు పాటలు పాడుతూ.. డప్పు వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ సీత్లా ప్రతిష్ఠ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ పూజ సమయంలో మహిళల పాటల్లో ప్రకృతి, వ్యవసాయ, పశు సంపదపై వారికున్న అనుభవాలను పాటల రూపంలో కనబడుతుంది. అనంతరం నవధాన్యాలను పశువుల మీద చల్లి దాటించి, తండా వాసులందరూ బాగుండాలని సీత్లా భవానీకి మొక్కులు చెల్లిస్తారు.

సంప్రదాయ నైవేద్యం, పూజలు

పొలిమేరలో ప్రతిష్ఠించిన సీత్లా మాతను బంజారాలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని సాంప్రదాయంగా పూజలు చేస్తూ, పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. మేకలను బలిచ్చి వాటి పేగు పైనుంచి పశువులను దాటిస్తారు. దీనిని గొడ్ల దాటుడు (దాటోడి) అని పిలుస్తారు. పండుగ రోజు ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన రాళ్లను పూలతో అలంకరించి తమ ఇళ్లలో ముందు రోజు నానబెట్టిన జొన్నలు, నవధాన్యాలు గుగ్గిళ్లు వంటి నైవేద్యం వండుతారు. ఇంట్లో తయారుచేసిన బెల్లన్నం(లాప్సీ) గంగాజలంతో పూజలు చేస్తారు. ఉల్లిపాయ, ఎండు మిర్చి కానుకలు సమర్పిస్తారు.

బంజారాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి



బంజారాలకు సీత్లాభవానీ పండుగ ప్రత్యేకం. బంజారాల పండుగలపై వారి ఆచార సాంప్రదాయాలను వెలికితీసే విధంగా పరిశోధనలు జరగాల్సి ఉంది. బంజారాలకు పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అవకాశాలు కల్పించాలి. వారి పండుగలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి తగిన సదుపాయాలు, చేయూత ఇవ్వాలి.

- భూక్య బాబురావు, పీఠాధిపతి, జానపద గిరిజన విజ్ఞాన పీఠం, వరంగల్‌

అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి



తెలంగాణలో దాదాపు బంజారాలు 50లక్షల మంది పైగా ఉన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన బంజారాలను ప్రభుత్వం గుర్తించాలి. ప్రత్యేక రోజు అనేది లేకుండా బంజారాలు వారికి వీలైన రోజుల్లో సీత్లా భవానీ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఈ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు జరుపుకునేలా తీర్మానించాం. సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు దినంగా ప్రకటించింది. సీత్లాభవానీ పండుగ రోజునూ ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలి.

- బానోత్‌ నవీన్‌ నాయక్‌, సీత్లా భవానీ పండుగ ఉత్సవ కమిటీ, రాష్ట్ర అధ్యక్షుడు, పర్శనాయక్‌ తండా, నర్సంపేట

ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్‌

- రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌ చైర్మన్ల నియామకంపై ఉత్తర్వులు
- ఉమ్మడి వరంగల్‌ నుంచి నలుగురికి ఛాన్స్‌...
- 'కుడా' చైర్మన్‌గా వెంకట్రామ్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డికి 'ఆయిల్‌ సీడ్స్‌'..
- ప్రకాశ్‌రెడ్డికి 'వాణిజ్యం', బెల్లయ్యనాయక్‌కు ఎస్టీ కార్పొరేషన్‌..

సాక్షి ప్రతినిధి, వరంగల్‌: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్‌ పదవుల పంపకానికి అధికారికంగా శ్రీకారం చుట్టింది. తెలంగాణ వ్యాప్తంగా 35 కార్పొరేషన్ల చైర్మన్ల నియామకానికి ఎట్టకేలకు సోమవారం జీఓ విడుదల చేసింది. వాస్తవానికి మార్చి 15వ తేదీనే ఈ నియామకాలపై స్పష్టత వచ్చినప్పటికీ.. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ నియమాకాల ప్రక్రియ ప్రకటనకు అడ్డంకిగా మారింది. ఎట్టకేలకు సుమారు 100 రోజుల తర్వాత సీఎస్‌ శాంతికుమారి రాష్ట్ర కార్పొరేషన్‌ చైర్మన్ల నియమాక ఉత్తర్వులు అధికారికంగా విడుదల చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్‌లోని నలుగురు కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు నామినేటెడ్‌ పదవుల్లో అవకాశం దక్కింది.

ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురికి 'నామినేటెడ్‌'..

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో 35 మందిలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరుగురు సీనియర్లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్‌ పదవులు దక్కాయి. ఆరు పదవుల్లో ఐదు రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌ చైర్మన్లు కాగా, ఒకటి జిల్లాస్థాయి పదవి ఉంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కోటాలో పదవి దక్కింది. సీనియర్‌ కాంగ్రెస్‌ నేత జంగా రాఘవరెడ్డికి ఆయిల్‌ సీడ్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ పదవి దక్కింది. అదే విధంగా ఎండీ.రియాజ్‌కు తెలంగాణ గ్రంథాలయ పరిషత్‌, పరకాల నుంచి ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డికి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్‌ పదవులు దక్కాయి. గత ఎన్నికల్లో జంగా రాఘవరెడ్డి, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్‌ ఆశించగా.. అధిష్టానం నిర్ణయం మేరకు అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకున్నారు. అదే విధంగా జయశంకర్‌ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి వాణిజ్య ప్రోత్సాహక కార్పొరేషన్‌ చైర్మన్‌గా నియమితులు కాగా, మహబూబాబాద్‌ జిల్లా నుంచి టికెట్‌ ఆశించిన బెల్లయ్య నాయక్‌కు తెలంగాణ గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో సుమారు నాలుగున్నర నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్‌ కమిషన్‌ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యను కలుపుకుని ఉమ్మడి వరంగల్‌ నుంచి మొత్తం ఏడుగురికి నామినేటెడ్‌ పదవులు దక్కినట్లయ్యింది.

ఆశావహులకు మళ్లీ నిరాశే..

మార్చిలో నియామక ఉత్తర్వులకు బ్రేక్‌ పడిన సమయంలో.. మార్పులు, చేర్పులకు అవకాశం ఉందనే ప్రచారంతో ఉమ్మడి వరంగల్‌ నుంచి ప్రయత్నాలు చేసుకున్న పలువురు సీనియర్లకు నిరాశే ఎదురైంది. ఈసారి వెలువడిన ఉత్తర్వులు కూడా పలువురు సీనియర్లను అసంతృప్తికి గురి చేశాయి. పలువురు సీనియర్లు.. అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చిన నేతలు, ఎమ్మెల్యేగా ఓటమి చెందిన వారికి ఈ జాబితాలో ప్రాధాన్యం దక్కకపోవడం చర్చనీయాంశమవుతోంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి ఓటమి చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సింగాపురం ఇందిర, వరంగల్‌ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట టికెట్‌ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్‌, సీనియర్‌ నేతలు ఈవీ శ్రీనివాస్‌రావు, పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, కూచన రవళిరెడ్డి, జాలి కమలాకర్‌ రెడ్డి, కత్తి వెంకటస్వామి, బండి సుధాకర్‌ గౌడ్‌, లక్ష్మీనారాయణ నాయక్‌, నాయిని లక్ష్మారెడ్డి, బట్టి శ్రీనివాస్‌కు దక్కలేదు. పాలకుర్తి నుంచి కోడలు యశస్వినిరెడ్డిని బరిలో దింపి ఎమ్మెల్యేగా గెలిపించిన ఝాన్సీరెడ్డికి ప్రోటోకాల్‌ కోసం రాష్ట్రస్థాయి పదవి ఈసారీ రాలేదు. దీంతో నిరాశకు గురైన సీనియర్లు, ఆశావహులు సీఎంరేవంత్‌ రెడ్డిని కలిసేందుకు సిద్ధం అవుతున్నారు.

'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి



నగరాన్ని బెస్ట్‌ సిటీగా చేయడమే ధ్యేయం
'కుడా' చైర్మన్‌ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

నయీంనగర్‌ : వరంగల్‌ నగరాన్ని బెస్ట్‌ సిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయమని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్‌ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం 'కుడా' చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కుడా' చైర్మన్‌ పదవి రావడానికి కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా మంత్రులు, ఉమ్మడి వరంగల్‌ ప్రజాప్రతినిధులు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన వెంకట్రామ్‌రెడ్డికి మేయర్‌ సుధారాణి, వరంగల్‌ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌ రెడ్డి, 'కుడా' కమిషనర్‌ అశ్విని తానాజీ వాకడే, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాత్రి చోరీలు.. పగలు జల్సాలు

- దొంగల ముఠా అరెస్ట్‌
- ఎనిమిది విద్యుత్‌ మోటార్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యుత్‌ మోటార్లు

హసన్‌పర్తి : రాత్రి వేళ చోరీలకు పాల్పడుతూ.. పగలు జల్సా చేస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ మేరకు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నగరంలోని మడికొండకు చెందిన పత్రి రాజు, శ్రీపతి ప్రేమ్‌కుమార్‌, తూర్పాటి ఏసుకుమార్‌ గ్రామాలకు వెళ్లి పాత ఇనుప సామాను సేకరించే వారు. అయితే వచ్చిన డబ్బులతో జల్సాలు చేయడం ప్రారంభించారు. జల్సాలకు ఆ డబ్బులు సరిపడకపోవడంతో రాత్రి వేళ చోరీలకు తెరలేపారు. వృత్తిని వదిలిపెట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈక్రమంలో వ్యవసాయ బావులకు ఉన్న మోటార్లు చోరీ చేసిన అనంతరం వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సా చేసేవారు. ఈ క్రమంలో కేయూసీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్లు తీసుకుని ద్విచక్రవాహనంతో వెళ్తూ పోలీసులకు చిక్కారు. అనుమానస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలు అంగీకరించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరించారు. ఈ మేరకు ఎనిమిది మోటార్లతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ చెప్పారు. సమావేశంలో కేయూ సీఐ సంజీవ, సీసీఎస్‌ సీఐ అబ్బయ్య, ఎస్సైలు రాజ్‌కుమార్‌, దేవేందర్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా, నిందితులు కేయూ పీఎస్‌ పరిధిలో రెండు, నల్లబెల్లి, దుగ్గొండి, చిల్పూరు, ఎల్కతుర్తి, సంగెం, స్టేషన్‌ ఘన్‌పూర్‌ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మోటార్లు చోరీ చేశారని ఏసీపీ తెలిపారు.

యాసిడ్‌ కలిపిన వాటర్‌ తాగి విద్యార్థినికి అస్వస్థత


హిందు

తరిగొప్పుల: యాసిడ్‌ కలిపిన వాటర్‌ తాగి విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చోటుచేసుకుంది. విద్యార్థిని తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన శివరాత్రి హిందు స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 8వ తరగతి చదువుతుంది. కాగా ఆదివారం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం హిందు తన వాటర్‌బాటిల్‌లోని నీటిని తాగింది. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు ఆ బాటిల్‌లో బాత్‌రూంలో వినియోగించే యాసిడ్‌ను కలిపారు. ఆ వాటర్‌ తాగిన విద్యార్థిని స్వల్ప అస్వస్థతకు గురైంది. విద్యార్థిని గ్రహించి పాఠశాల ప్రత్యేక అధికారికి తెలియజేయగా ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. అనంతరం విద్యార్థిని తల్లికి సమాచారం అందించి అప్పగించారు. తమ కూతురుకు సహచర విద్యార్థులకు ఎలాంటి గొడవలు లేవని తెలిపింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కారకులతో పాటు పాఠశాల ప్రత్యేక అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది


కేక్‌ కట్‌ చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య, చిత్రంలో గుడి వంశీధర్‌రెడ్డి, తదితరులు

- స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఘన్‌పూర్‌లో ఘనంగా కడియం జన్మదిన వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్‌: 'ఎన్ని జన్మలు ఎత్తినా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది.. నేను, నా కుటుంబం జీవితాంతం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటాం' అని స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్‌ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌ నాయకులు, కడియం శ్రీహరి అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం కడియం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్‌ కావ్య, ఎమ్మెల్యే కడియం హాజరయ్యారు. కడియం కేక్‌ కట్‌ చేసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, కాంగ్రెస్‌పార్టీ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల సహకారంతోనే తాను ఎమ్మెల్యేగా, కావ్య ఎంపీగా విజయం సాధించారన్నారు. తుదిశ్వాస వరకు నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్‌.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్‌, గుడి వంశీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, అన్నం బ్రహ్మారెడ్డి, మంతెన ఇంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రజాక్‌యాదవ్‌, పోశాల కృష్ణమూర్తి, తోట సత్యం, కనకం గణేశ్‌, కొలిపాక సతీశ్‌, తెల్లాకుల రామకృష్ణ, పద్మారెడ్డి, కిషన్‌రాజ్‌, గట్టు రమేశ్‌, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, చిల్పూరు శ్రీ బుగుల వెంకటేశ్వరస్వామి ఆలయంలో తన జన్మదినం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గేదెను కాపాడబోయి రైతు మృతి

- నారాయణపురంలో ఘటన


కరెంట్‌ షాక్‌తో మృతి చెందిన గేదె, స్వామి

బచ్చన్నపేట : కరెంట్‌ షాక్‌తో గేదె, ఆ మూగజీవాన్ని కాపాడబోయిన ఓ యువరైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నారాయణపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిటి స్వామి (32) తన పశువులను మేపడానికి రోజూమాదిరిగానే సోమవారం ఉదయం పోతులోని కుంట వద్దకు వెళ్లాడు. అక్కడ కరెంట్‌ స్తంభాలపై ఎల్‌టీ లైన్‌, కింద సరఫరా లేని తీగలు వేలాడుతున్నాయి. గతంలో పలుమార్లు ఆ కరెంట్‌ తీగలు పశువుల కొమ్ములకు చుట్టుకునేవి. మృతుడు స్వామి ఆ తీగలు విడిపించి పశువులను తోలుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం కూడా ఓ గేదె వేలాడుతున్న కరెంట్‌ తీగలను కొమ్ములకు చుట్టుకుని కొద్ది దూరం లాక్కొని వెళ్లింది. ఈ తీగలకు ఉన్న కాసారం వంగి పైన కరెంట్‌ సరఫరా ఉన్న తీగలకు తాకింది. దీంతో కరెంట్‌ సరఫరా అయి షాక్‌తో ఆ గేదె మృత్యువాత పడింది. దీనిని గమనించని రైతు స్వామి.. ఎప్పటి లాగే కరెంట్‌ తీగ గేదె చుట్టుకుందని భావించి విడిపించడానికి వెళ్లగా ఎర్త్‌ అయి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలికి ఎస్సై కంకల సతీష్‌కుమార్‌ చేరుకుని ప్రమాద తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వేలాడిన కరెంట్‌ తీగలను ట్రాన్స్‌కో అధికారులు తొలగించకపోవడంతోనే స్వామి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

గేదె పొడిచి పశువుల కాపరి..


జనార్దన్‌ (ఫైల్‌)

రాయపర్తి(వర్ధన్నపేట): గేదె పొడవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ కథనం ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన తోట జనార్దన్‌ (59) పట్టణానికి చెందిన గుజ్జ సోమేశ్వర్‌రావు వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. ఈనెల 6న గేదెలు మేపేందుకు వెళ్తుండగా ఓ గేదె.. జనార్దన్‌ను పొడిచింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన జనార్దన్‌ను ఎంజీఎం తరలించగా చికిత్స చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.మృతుడి కుమార్తె దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణం తీసిన భూతగాదా..

- మాజీ సర్పంచ్‌ దారుణ హత్య
- బురహాన్‌పల్లిలో ఘటన


దేవేందర్‌ (ఫైల్‌)

రాయపర్తి: భూతగాదా.. ఒకరి ప్రాణం తీసింది. మాజీ సర్పంచ్‌ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలం బురహాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ సూదుల దేవేందర్‌(56) హనుమకొండలోని యాదవనగర్‌లో కుటుంబీకులతో కలిసి నివాసముంటున్నాడు. సర్పంచ్‌ పదవి ముగిసినా పలువురి గ్రామస్తుల సమస్యల పరిష్కారం కోసం గ్రామంలోనే ఒంటరిగా ఉంటున్నాడు. ఈక్రమంలో సోమవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఒంటరిగా ఉన్న దేవేందర్‌ను గమనించిన దుండగులు సుత్తితో తలపై మోదీ దారుణంగా హత్య చేశారు. గ్రామంలో మూడెకరాల భూమి విషయంలో గ్రామానికి చెందిన పల్లె మల్లేశ్‌తో దేవేందర్‌కు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఒకరికొకరు బాహాటంగానే చంపుతానని అనుకునేవారు. భూమి విషయంలో గతంలో పోలీస్‌ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. మాజీ సర్పంచ్‌ హత్యపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్‌ డీసీపీ రాజమహేంద్రనాయక్‌, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసు జాగిలం అనుమానాస్పద వ్యక్తి పల్లె మల్లేశ్‌ ఇంటికే వెళ్లి ఆగడంతో గ్రామంలో అతడిపైనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యలో పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు వెస్ట్‌జోన్‌ డీసీపీ తెలిపారు. కాగా, తమ తండ్రి దేవేందర్‌ను పల్లె మల్లేశ్‌, అతడి కుమారుడు మురళి హత్య చేశారని మృతుడి కుమారుడు నిఖిల్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్‌ తెలిపారు. మాజీ సర్పంచ్‌ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, దారుణహత్యకు గురైన బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్‌ సూదుల దేవేందర్‌ మృతదేహాన్ని జరిపేందుకుగాను గ్రామానికి చెందిన బాలె కొమురయ్య(70)అధికారులకు సహకరించాడు. ఈ క్రమంలో రక్తమడుగులో ఉన్న మృతదేహాన్ని చూసిన కొమురయ్యకు విరేచనాలయ్యాయి. ఇంటికి వెళ్లిన అనంతరం మృతిచెందాడు.

సీఎస్‌సీలతో సహకార సంఘాలు బలోపేతం

- టీఎస్‌ కోఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంకు చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు


మాట్లాడుతున్న టీఎస్‌ కోఅపెక్స్‌ బ్యాంకు చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు

హన్మకొండ: కామన్‌ సర్వీస్‌సెంటర్‌ (సీఎస్‌సీ) ల నిర్వహణతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మరింత బలోపేతయవుతాయని టీఎస్‌ కోఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంకు, వరంగల్‌ డీసీసీబీ చైర్మన్‌ మార్నేని రవీందర్‌ రావు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణాధికారులు, కంప్యూటర్‌ ఆపరేటర్‌లకు ఈగవర్నెన్స్‌ సర్వీస్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో కామన్‌ సర్వీస్‌ సెంటర్‌ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మార్నేని రవీందర్‌ రావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, వివిధ రకాల నోటిఫికేషన్‌లకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యుత్‌, మున్సిపల్‌ ఇతర బిల్లులు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌ ద్వారా జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో మీ సేవ కేంద్రాల్లో అందించే సేవలను ఇక నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందించి గ్రామీణులకు డిజిటల్‌, ఆన్‌లైన్‌ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సంక్షేమ పథకాలు, ఆధార్‌ సేవలు, పాన్‌కార్డు, ఎలక్ట్రికల్‌ బిల్స్‌, ఇంటి, నీటి పన్ను చెల్లింపులు, ఇన్‌కమ్‌ టాక్స్‌ రిటర్న్స్‌ ఫైలింగ్‌, పాస్‌పోర్టు సేవలు, మున్సిపల్‌ సర్వీసెస్‌, ఆర్‌టీఓ సేవలు, ఫాస్ట్‌ ట్యాగ్‌, రుణాలు, ఇన్సూరెన్స్‌, పెన్షన్‌తో పాటు అనేక రకాల సేవలు ఈ కామన్‌ సర్వీస్‌ సెంటర్‌ ద్వారా అందించనున్నట్లు వివరించారు. కామన్‌ సర్వీస్‌ సెటర్‌ నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని సహకార సంఘాల సీఈఓలు, కంప్యూటర్‌ ఆపరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ ఎం.డి.వజీర్‌ సుల్తాన్‌, జనరల్‌ మేనేజర్‌ ఉషశ్రీ, డీజీఎం అశోక్‌, ఈ గవర్నెన్స్‌ సీనియర్‌ మేనేజర్‌ హరికృష్ణ, డీసీసీబీ మేనేజర్లు మాధురి, అరుణ్‌ కుమార్‌, లావణ్య, పవన్‌, అనంత బాబురావు పాల్గొన్నారు.